ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 19.11.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రేమ, శాంతితో కూడిన వసుధైక కుటుంబ భావన సత్యసాయి బాబాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టపర్తి పర్యటనలో వ్యాఖ్యానించారు.

2. ఇందిరాగాంధీ జయంతి సభలో కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్ది సేపటి క్రితం ప్రారంభించారు.

3. తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఈరోజు నుంచి మరోసారి విచారణ చేపడుతున్నారు.

4. సుప్రీంకోర్టు విధించిన స్టేకి విరుద్ధంగా తలపెట్టిన ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును, అలాగే, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నూతన స్వరూపాన్ని అడ్డుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

--------------------

**ప్రధానమంత్రి**

ప్రేమ, శాంతితో కూడిన వసుధైక కుటుంబ భావన సత్యసాయి బాబాదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. విశ్వశాంతి, విశ్వసేవను బాబా మనకు చాటి చెప్పారని పేర్కొన్నారు. పుట్టపర్తికి రావడం, సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టమని

పేర్కొన్నారు. ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో జరిగిన సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి స్మారక నాణం విడుదల చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. సత్యసాయి బాబా బోధనలు ఎంతోమందికి మార్గం చూపాయని కొనియాడారు. అంతకుముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానమంత్రికి... ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రశాంతి నిలయంలోని భగవాన్ శ్రీసత్యసాయి బాబా మహా సమాధి వద్ద ప్రధానమంత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అక్కడ గోదాన కార్యక్రమంలో భాగంగా నలుగురు రైతులకు గోదానం చేశారు.

**ఎస్ఎస్డీ, డెస్క్**

-----------------------

**చీరలు**

రాష్ట్రంలో కోటి ఇందిరమ్మ చీరల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు హైదరాబాద్ లో లాంఛనంగా ప్రారంభించారు. పలువురు లబ్ధిదారులకు చీరలను అందించారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్ వద్ద ఇందిరా గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన ముఖ్యమంత్రి కోటి చీరల పంపిణీ తొలి దశను లాంఛనంగా ప్రారంభించారు. ఈ రోజు నుంచి వచ్చే నెల 9వ తేదీ తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ చేస్తారు. రెండో దశలో మార్చి 1 నుంచి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో చీరల పంపిణీ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఇందిరమ్మ స్ఫూర్తితో తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందనీ, మహిళా సాధికారతకోసం ఎన్నో చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

**బైట్ ముఖ్యమంత్రి**

ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, శాసనసభ్యులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**MSL**

------------------------------

**వివేక్**

మంచిర్యాల జిల్లా చెన్నూరులో ఇసుక మాఫియా ను పూర్తి స్థాయిలో అరికట్టినట్లు రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు... ఈ రోజు భావురావు పేట గ్రామ సమీపంలో నూతన సాండ్ బజార్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

**సౌండ్ బైట్....మంత్రి వివేక్....**

**పీటీసీ - మంచిర్యాల**

-----------------------

**హెల్త్ క్యాంప్**

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్ రాష్ట్ర సచివాలయంలోని మూడో అంతస్థులో సెక్రటేరియట్ ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ కోసం AI Based మెగా కార్డియాక్ హెల్త్ క్యాంపును ఈ ఉదయం ప్రారంభించారు. సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ హెల్త్ క్యాంప్ లో అత్యాధునిక పరికరాలతో వివి పరీక్షలను నిర్వహిస్తున్నారు.

**పీఎస్**

-----------------------

**విచారణ**

తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల అంశంపై  నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరోమారు విచారణ చేపడుతున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువులోగా నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ఈరోజు, తెల్లం వెంకట్రావు , సంజయ్లపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ విచారణ చేపట్టనున్నారు. ఇరు వర్గాల న్యాయవాదుల

వాదనలను ఆయన వింటారు. అలాగే, ఈ నెల 20వ తేదీన పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీలపై దాఖలైన పిటిషన్లకు సంబంధించిన వాదనలను కూడా స్పీకర్ వింటారు.

**పీటీసీ - హైదరాబాద్**

----------------------

**ఉత్తమ్**

సుప్రీంకోర్టు విధించిన స్టేకి విరుద్ధంగా కర్ణాటక ప్రభుత్వం తలపెట్టిన ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపును, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు నూతన స్వరూపాన్ని అడ్డుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆయన నిన్న సాయంత్రం ఢిల్లీ శ్రమశక్తిభవన్‌లో కేంద్ర మంత్రిని కలిసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రలలో ఏ పార్టీల ప్రభుత్వాలు ఉన్నప్పటికీ కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణకున్న హక్కులను కాపాడుకోవడానికి తమ ప్రభుత్వం పోరాటం చేస్తుందన్నారు.

**పీఎస్**

---------------------

**DAY ANDHRA- MAOISTS**

ఆంధ్రప్రదేశ్‌లోని రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో ఈ తెల్లవారు జామున మరోసారి కాల్పులు జరిగాయి. విజయవాడలో ఏపీ ఇంటెలిజెన్స్ అదనపు డైరెక్టర్ జనరల్ మహేష్ చంద్ర లడ్డా మీడియాతో మాట్లాడుతూ... అటవీ ప్రాంతంలో భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరు నుంచి ఏడుగురు మావోయిస్టులు మరణించారని అన్నారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదని ఆయన అన్నారు. మరణించిన వారిలో కొంతమంది సీనియర్ నాయకులు ఉన్నారని, అయితే, ఇందుకు సంబంధించి మరింత సమాచారం రావాల్సి ఉందని ఆయన అన్నారు.

**ఎస్ఎస్డీ**

---------------------

**జూడో**

ఎల్బీ స్టేడియంలో సబ్ జూనియర్ నేషనల్ జూడో చాంపియన్షిప్ -2025 విజేతలకు ఈరోజు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ బహుమతులు ప్రధానం చేశారు. హైదరాబాద్ లోని ఎల్ బీ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో 29 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

**పీఎస్**

---------------------------

**వాతావరణం**

రాష్ట్ర రాజధాని నగరం హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో చలి తీవ్రత మరింతగా పెరిగింది. చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. సాయంత్రం నుంచే చలి మొదలై.. ఉదయం తొమ్మిది గంటల దాకా ఆ ప్రభావం ఉంటోంది.

**డెస్క్**

------------------------

**హైకోర్టు**

2015-16 గ్రూప్-2ను రద్దు చేస్తూ హైకోర్టు నిన్న తీర్పు వెలువరించింది. అప్పటి ఎంపిక జాబితాను కొట్టివేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు, సాంకేతిక కమిటీ సిఫార్సులకు విరుద్ధంగా డబుల్ బబ్లింగ్, వైట్నర్ వినియోగం, తుడిపివేతలున్న పార్ట్-బి పత్రాలను పునర్ మూల్యాంకనం చేయడం చెల్లదని పేర్కొంది.

**డెస్క్**

--------------------------

**గుస్సాడీ**

గోవా వేదికగా జరగనున్న 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం(ఐఎఫ్ఎఫ్ఐ)లో తెలంగాణ గిరిజన కళారూపం గుస్సాడి ప్రధాన ఆకర్షణగా నిలవబోతుంది. ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు 9 రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ప్రదర్శనలు ఇచ్చేందుకు దేశవ్యాప్తంగా 10 సంప్రదాయ నృత్య బృందాలను ఎంపిక చేస్తారు. 20న ప్రారంభ వేడుకలో తెలంగాణ గోండు గిరిజన కళాకారులు గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

**పీఐబీ**

-------------------------

**చర్యలు**

నిబంధనలు అతిక్రమిస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకొంది. రెండు కేంద్రాలను శాశ్వతంగా మూసివేయాలని, పది కేంద్రాల్లో కొన్నాళ్లపాటు సేవలు నిలిపివేయాలని కుటుంబ సంక్షేమ కమిషనర్ సంగీత సత్యనారాయణ తాజాగా ఆదేశాలిచ్చారు.

**డెస్క్**

-------------------------

**జపాన్**

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ లో జపాన్ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జపాన్- భారత్ సంయుక్తంగా విద్య పరిశోధనల పరస్పర సహకారానికి వేదికగా హైదరాబాద్ ఐఐటి నిలుస్తుందనీ ఇరు బృందాలు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డాయి. 4వ జపాన్-భారత్ విశ్వవిద్యాలయాల ఫోరమ్‌కు 37 జపనీస్ విశ్వవిద్యాలయాలు, 36 భారతీయ విశ్వవిద్యాలయాల అధిపతులు హాజరయ్యారు.

**పీటీసీ - సంగారెడ్డి**

----------------------